# సంస్కరణ

సంస్కర్త, సామాన్యుడూ ఎదురుపడ్డారు పెద్ద బజారులో. సంస్కర్త సామాన్యుడి భుజం మీద చేయివేసి, "ఏమోయ్, ఇంత పాడైపోయావేం?" అని అడిగాడు.

సామాన్యుడు అనుమానం వేసి తన వంక తనే చూసుకున్నాడు కాసేపు. జేబు దగ్గిర చిరిగిన షర్టు, బిళ్ళ గోచీ పంచె, పైని తుండుగుడ్డ, కొంచెం చెరిగిన క్రాపూ, జేబులో పావలా డబ్బులూ — తనేమీ మార లేదే? సామాన్యుడు తలెత్తి సంస్కర్తలోకి చూసి, "నేనేం పాడైపోయా నండి? మామూలుగానే వున్నాను" అన్నాడు.

సంస్కర్త మోకాళ్ళ వరకూ వేళ్ళాడే ఖద్దరు లాల్చీ, జీరాడే గ్లాస్కో పంచె, పైకి దువ్విన అమెరికన్ క్రాఫ్, గోవాడ పై పంచె, కొల్హాపూర్ స్లిప్పర్లు తొడుక్కొని, సామాన్యుణ్ణి చలవ సులోచనల్లో గుండా తీవ్రంగా చూసి, "నువ్వంటే నువ్వే కాదోయ్, అసలు సంఘమే పాడై పోయింది" అన్నాడు ఆదుర్దగా.

సామాన్యుడు తలగోక్కుని "గావును. ఎవ్వరితోనూ చెప్పకుండా అట్లా చెడి పోవడం ఏమిటండి" అన్నాడు సీరియస్‌గా.

సంస్కర్త సులోచనాలు పై పంచెతో తుడుస్తో, "సంఘం అనేక విధాల పాడై పోతోంది. తెలుసా?" అన్నాడు మరీ ఆదుర్దగా.

సామాన్యుడు తాపీగా ఒక తాజ్ మహల్ బీడి వెలిగించి, "పోతే పోనీండి, మనకెందుకూ మధ్య" అన్నాడు పరాకుగా.

సంస్కర్త కోపంగా చూశాడు సామాన్యుణ్ణి. తర్వాత సులోచనాలు తగిలించుకుని "మనకి కాకపోతే, ఇంకెవ్వరికి పడ్తుందోయ్, చూడు. సంఘంలో హరిజనులు అణగారిపోతున్నారు."

"నిజమే మరి" అన్నాడు సామాన్యుడు.

"వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఇప్పించాలి మనం" అన్నాడు సంస్కర్త.

సామాన్యుడికి అనుమానం వేసింది. మాలవాళ్ళు అణగారిపోతుంటే చదువు చెప్పించాలి, అన్నం పెట్టించాలి గాని, దేవాలయ ప్రవేశం ఏమిటి వాళ్ళని మోసం చెయ్యడం కాకపోతే? సామాన్యుడు సంస్కర్తని ఎగాదిగా చూసి "వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఎందుకండీ? ఉన్న మతిపోవడానికా?" అని అడిగాడు.

దాంతో సంస్కర్త సామాన్యుణ్ణి రోడ్డు పక్క అరుగు మీద కూర్చోబెట్టి, "వాళ్ళకి దేవుణ్ణి దర్శించే హక్కు ఇప్పించాలయ్యా" అన్నాడు కోపంగా.


సామాన్యుడికి ఇంకా అనుమానం వేసి, "దేవుణ్ణి ప్రార్థిస్తే సరిపోతుందంటారా? ఇప్పటికి పాతికేళ్ళబట్టి నేను దేవుడిని ప్రార్థిస్తూనే వున్నాను. ఏమీ ఊడిపడలేదు నాకు. వాళ్ళకి మాత్రం..." అని ఇంకేదో చెప్పబోతో వుంటే, సంస్కర్త సామాన్యుడిని ఆపి, ఆ సమస్యతప్పించేసి, "అది పోనీవయ్యా, నీకన్నీ సందేహాలే. ఇటు చూడు. సంఘంలో స్త్రీ స్వాతంత్ర్యం లేక అల్లాడి పోతోంది" అన్నాడు.

సామాన్యుడు ఆలోచించాడు, "నిజమేననుకోండి మా ఆవిడ 'చదువుకోవే' అని మొత్తుకున్నా చదవడం లేదండి. ఏం చేయను?" అని అడిగాడు సంస్కర్తని.

సంస్కర్త సామాన్యుడిని కొంచెం చుర చుర చూసి, "మీ ఆవిడ సంగతీ, మా ఆవిడ సంగతీటోయ్ మనం మాట్లాడేదీ" అన్నాడు.

సామాన్యుడు కాస్త తగ్గి "మా ఆవిణ్ణీ మీ ఆవిణ్ణీ మినహాయించా మీరు మాట్లాడుతోంది? క్షమించండి" అన్నాడు.

సంస్కర్త మళ్ళీ మాట తప్పించి, "నీకు బొత్తిగా సంస్కరణ అంటే



ఏమిటో తెలియడంలేదోయ్" అన్నాడు విసుగ్గా.

"నాకెట్లా తెలుస్తుందండి సామా



(ఆగస్టు 17, శారదసంస్మరణగా)

**

'సాహిత్య బాటసారి శారద' సౌజన్యంతో

మ్యుడివి'' అన్నాడు సామాన్యుడు వినమ్రతగా.

సంస్కర్త ఎందుకో జేబులు తడవుకొని "ఒక బీడి ఉంటే ఇవ్వవోయ్'' అని అడిగాడు సామాన్యుడిని.

సామాన్యుడు బీడీ, నిప్పెట్టా రెండూ ఇచ్చి "అయితే మహాశయా, సంఘం అంతా పాడై పోయిందంటారా?'' అని అడిగాడు భయం భయంగా.

"మెల్లగా అంటావేమిటి?'' అన్నాడు సంస్కర్త బీడీ వెలిగిస్తో.

"అయితే ఎట్లా?''

"సంస్కరణ చెయ్యాలి.''

"అంటే?''

"మళ్ళీ మొదటి కొచ్చేవోయ్. మొదట హరిజన సమస్య, ఆ తర్వాత స్త్రీ జనోద్ధరణ, ఆ తర్వాత...''

"ఇంతకీ సామాన్యులు బతికే ఉపాయం, దరిద్రం ఒదిలే మార్గం ... అవేమీ మన సంస్కరణ ప్రణాళికలో వుండవా యేమండి?'' అన్నాడు సామాన్యుడు మామూలుగా.

"అవన్నీ పాశ్చాత్య వాసనవల్ల వొచ్చిన పాడు మనస్తత్వమోయ్. ఒకడి దరిద్రం ఒదిలించేందుకు మనమెవరిమోయ్, అదంతా సృష్టి విలాసం. భగవదేచ్ఛ!'' అన్నాడు సంస్కర్త గుడ్లు తేలేసి.

సామాన్యుడు ఈ వివరం నిజమని నమ్మలేకా, కాని పెద్ద మనిషిని వ్యతిరేకించలేకా, "పోనీ హరిజనోద్ధరణ భగవదేచ్ఛకి ఒదిలి, స్త్రీ స్వాతంత్ర్యం విధికి వొదిలితే చిక్కు వొదులుతుంది కదండి?'' అన్నాడు.

సంస్కర్త సామాన్యుడిని ఎందుకో గాని మింగేద్దామా అన్నట్టు చూసి "నీవు ఇట్టా అడ్డ దిడ్డంగా మాట్లాడ గూడదోయ్, తెలిసీ తెలియకా?'' అన్నాడు.

సామాన్యుడికి ఈ మందలింపు అర్థం కాలేదు. "తను మాట్లాడే గూడదా?''

"యామండి. నేనసలు మాట్లాడే గూడదంటారేమిటి? అందుకన్నా నాకు స్వేచ్ఛ లేదూ?'' అని అడిగాడు కాస్త చికాకుగా.

సంస్కర్త జేబులోంచి ఓ కాయితం తీసి "నువ్వు పెద్దల్ని ఇట్లా ప్రశ్నించ కూడదు. ఇదిగో నువ్వు కూడా మా సంఘ సంస్కరణోద్యమ సంఘంలో చేరు. చందా పావలా మాత్రమే'' అన్నాడు.

సామాన్యుడు, ఏడ్చినట్టుంది వ్యాపారం అని మనసులో అనుకుని, పావలా బిళ్ళ జేబులోంచి తీసి సంస్కర్త చేతిలో పెట్టి "చేర్చుకోండి నన్నూ ఓ సభ్యుడిగా-'' అన్నాడు గత్యంతరం లేక.

సంస్కర్త సంతోషంగా పావలా జేబులోకి నెట్టి, సామాన్యుడికి ఓ రశీదు పుస్తకం చూపించి, "నువ్వు ఇక సంస్కర్తవోయ్. ఈ పుస్తకం తీసుకుని ఇంకా మెంబర్లని చేర్పించు మన ఆశయాలు చెప్పి.'' అన్నాడు వెళ్ళడానికి సిద్ధపడి.

కాని సామాన్యుడు పుస్తకం తీసుకోకుండా, "ఎబ్బే! నాకు చాలా వేరే పన్లున్నయిలెండి'' అన్నాడు మర్యాదగా. నిరాకరించి వెళ్ళిపోయినాడు అక్కడనుంచి సంస్కర్త. "వీళ్ళకేం తెలుసు సంస్కరణ అంటే'' అనుకుంటూ కాళీ కాంబ కఫేలోకి పోయినాడు.

(రచనా కాలం 1948 ఏప్రియల్)



## శారద

తమిళ దేశం నుంచి ఒక కుర్రవాడు వలస వచ్చి గుంటూరు జిల్లాలోని తెనాలి హోటళ్ళలో 'సరవ' చాకిరీ చేస్తూ పైగా ....
మూర్ఖులతో, .... అనారోగ్యంతో,
దుర్భరమైన దారిద్ర్యంతో బాధలు పడుతూనే తెలుగునేర్చుకొని చాలా మంచి కథలూ, నవలలూ రాశాడంటే ఎంతో అద్భుతంగా వుంటుంది. నాలుగు దశాబ్దాల క్రిందట ఎస్. నటరాజన్ అలా వచ్చి తెనాలిలో వుండి, 'శారద' అనే కలం పేరుతో ఆ మంచి కథలూ, నవలలూ రాశాడనీ, అందులో కొన్నిటిని ఇప్పటికీ మనం చదవొచ్చుననీ తెలియకపోతే ... బహుశా అటువంటి సంఘటనను నమ్మలేక పోయేవాళ్ళమేమో!

"తెలుగు మాతృభాష కాకపోవడం వల్ల ఎంతో చదివితేగానీ రచనా వ్యాసంగం సాగడం లేదు'' అని శారద రాసుకొన్నాడంటే, ఆయన ఎంత దీక్షతో రచనను సాగించాడో అర్థం చేసుకోవచ్చు. ఇవాళ తెలుగు మాతృభాష అయినవాళ్ళు కూడా తెలుగు నేర్చుకోకుండానే, అందుకు శ్రమించకుండానే, పుంఖాను పుంఖంగా రచనలు చేస్తున్నారు. కేవలం ఏడెనిమిది సంవత్సరాలు మాత్రమే రచనలు చేసిన శారద తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. సాహిత్యాన్ని గురించి ఊహించ డానికే సాధ్యం కాని పరిస్థితుల్లో వుంటూ కూడా రచనలు చేశారన్నదే శారద ప్రత్యేకత కాదు.

ఆ రోజుల్లో చలం, ధనికొండ, రావూరి భరద్వాజ లాంటి బలమైన ప్రభావం నుంచీ, ఆ ప్రభావానికి కేంద్రంగా వుండిన తెనాలిలో వుంటూనే, కొత్తదారి తొక్కడం శారద ప్రత్యేకత. పెదపూడిలో జరిగిన సాహిత్య పాఠశాలకు హాజరు కావడం లాంటివి ఆ దారిలో ప్రయాణించడాన్ని తెలియజేస్తాయి. శారద నవల ఒకటి నెల రోజుల్లోనే పునర్ముద్రణ పొందిందంటే అప్పట్లోనే పాఠకులు శారదను ఎంత అభిమానించారో తెలుస్తుంది.

ఆగస్ట్ 17వ తేదీ వర్థంతి సందర్భంగా శారదను సంస్మరిస్తూ, పునర్ముద్రిస్తున్న 'సంస్కరణ' అన్న ఈ కథ మన గురజాడనూ, చైనా మహా రచయిత 'లూసన్'నూ జ్ఞాపకం చేయవచ్చు. 'సంస్కరణ' ఎంత వేళ్ళులేని బోలుదో శారద అర్థం చేసుకున్న తీరు ఇందులో అద్భుతంగా చిత్రితమయింది.